# తృప్తి

"నేను జాయిన్ కావడం లేదు." హఠాత్తుగా అన్నాడు మూర్తి.

నేను నిర్ఘాంతపోయాను. ఆశ్చర్యంగా మూర్తివైపు చూశాను. తరువాత నిరూపణ కోసం రావును కళ్లతోనే ప్రశ్నించాను. నిమ్మకు నీరెత్తినట్లు రావు ప్రశాంతంగా ఉన్నాడు.

రాజవిలాస్‌లో పార్టీ తీసుకుంటున్నాం మేం ముగ్గురం. మూర్తి, రావు ఒక జాతీయ సంస్థలో పనిచేస్తారు. ఇద్దరూ ఒకే స్థాయిలో ఉన్నారు. మామూలుగా వాళ్ల సంస్థలో ప్రమోషన్లు చాలా చాలా తక్కువ. ఏ కొద్దిమంది అదృష్టవంతులకో ఆ భాగ్యం లభిస్తుంది.

ఏం విధి విచిత్రమో కాని ఆ సంవత్సరం వారిద్దరికి ప్రమోషన్ వచ్చింది. ఏం చిత్రమోకాని ఇద్దర్ని అక్కడికి అరవైకిలోమీటర్ల దూరంలో ప్రారంభించిన కొత్త బ్రాంచిలో వేశారు ప్రమోషను మీద ట్రాన్సఫర్ ఇచ్చి.

సాధారణంగా కర్నూలుకు, ఉద్యోగరీత్యా బదిలీ అయి వచ్చిన వాళ్లు కర్నూలులోనే స్థిరపడుపోతూ ఉంటారు. ఇంకెక్కడికిపోమని బిగదీసుకుని కూర్చుంటారు. ఊరువదిలి వెళ్లడం ఇష్టం లేక వచ్చే ప్రమోషన్లు కూడా పోగొట్టుకుంటూ ఉంటారు.

మూర్తి,రావులు చిన్నవాళ్లేం కాదు. నాలుగు పదులకు కొంచెం పైబడినవాళ్లే! వాళ్ల సంస్థలో ప్రమోషన్లఅవకాశాలు తక్కువై ఉద్యోగంలో చేరి దాదాపు ఇరవై ఏళ్లు అయినా చేరిన స్థాయిలోనే ఉండిపోయారు. రాకరాక ప్రమోషను వస్తే నిన్నటిదాకా ప్రమోషన్ వచ్చిందని ఎగిరి గంతులు పెట్టిన వాళ్లు ఆ మాటకొస్తే ఎక్కువ ఆనందపడింది మూర్తి. వాళ్లల్లో అప్పుడే ఒకడు జారిపోయాడు.

"నీకేం పిచ్చాపెర్రా? మొన్నటిదాకా ప్రమోషన్ రాలేదని మానసిక రోగిలా కుంగిపోయావు. ఈ రోజు ఇస్తే పోనంటున్నావు? మతిపోయి మాట్లాడుతున్నావా?" నేను గద్దించి పెట్టాను.

"పోతే వెనక్కి రాలేనురా శర్మా". శూన్యంలోకి చూస్తూ బాధగా అన్నాడు మూర్తి.

"ఎందుకు రాలేవు?" చిరుకోపంగా అడిగాను.

"చాలా కారణాలు ఉన్నాయి. ఇక్కడ ఖాళీలు ఉండాలి. ట్రాన్సఫర్ లిస్టులో మన ప్రయారిటీ రావాలి. కొన్ని నెలలు - సంవత్సరాలు పట్టచ్చు. ఓ చాలా తతంగాలు ఉన్నాయి" మూర్తి నిట్టూర్చాడు.

"ఏం రావు?నిజంగానా?"

"మరి కష్టపడకుండా జీవితం ఎలా నడుస్తుంది?అవ్వకావాలి, బువ్వాకావాలి. అంటే కుదరదు" రావు అన్నాడు.

"ఎన్నాళ్లల్లో వెనక్కి రాగలరు?" అడిగాను.

"చెప్పలేం" మూర్తి నిరాశగా అన్నాడు.

"ఒక సంవత్సరం లేకపోతే సంవత్సరంన్నర" ఆశాపూరితంగా రావు చెప్పాడు.

"ఒరే పూల్! ఒక్క సంవత్సరం బయట ఊళ్లో గడపలేవా? తరువాత జీవితమంతా సుఖంగా ఉండొచ్చు కదా!"

"నాకు నమ్మకం లేదు. రావుకంటే ఇన్‌ఫ్లూయన్స్ నాకంటే ఎక్కువ! పైగా ఫ్యామిలీ షిఫ్టు చేయలేను అట్లాగని రోజూ అప్ అండ్ డౌన్ తిరగడం కూడా నాకు చేతకాదు". మూర్తి చాలా బాధపడుతూ చెప్పాడు.

నాకు అతని మొహం చూస్తే చాలా జాలేసింది. డయాబెటిక్ రోగినోటి దగ్గర లడ్డు

ఉన్నట్లుంది. అతని పరిస్థితి! ప్రమోషన్ వదులుకోవాలంటే అతని హృదయంలో ఎన్ని అగ్నిపర్వతాలు బద్దలవుతున్నాయో నాకు తెలుస్తున్నది.

"రావు, మరి నువ్వెందుకు పోతున్నావు?"

"రాకరాక వచ్చిన ప్రమోషన్ వదులుకుని ఎలా బతకమంటావు. నాకంటే జూనియర్స్ నాకంటే పెద్ద పోస్టుల్లో ఉన్నారు. ఎన్నాళ్లని గొంగళిలాగా ఉండమంటావు. జాయిన్ అవుతాను. మళ్లీ ట్రాన్స్‌ఫర్ అప్లై చేస్తాను. రోజూ పోయివస్తుంటాను" రావు చెప్పాడు ఉత్సాహంగా.

"పోనీ, ఫ్యామిలీ షిఫ్టు చేసెయ్యి" సలహా ఇచ్చాను.

''అమ్మో! ఆ ఊళ్లో మంచినీళ్ల కూడా సరిగ్గా దొరకవు. ఇక్కడ్నించి మోసుకుపోవాల్సిందే!"

"సో! అన్నీ ఇక్కడ్నించీ తీసుకుపోవాలి. ఒకే ఆల్ ది బెస్ట్". రావును అభినందించాను. కాలానికి ఉన్న వేగం కాంతికి కూడా లేదేమో అన్పిస్తుంది. క్యాంపు మీద క్యాంపులుబడి.. బంధువుల పెళ్లిళ్లకు హాజరవుతూ ఉంటే రెండునెల్లు ఇట్టే గడిచిపోయాయి.

మూర్తిని చూద్దామని వాళ్లింటికి వెళ్లాను.

మూర్తిని పోల్చుకోలేకపోయాను బాగా గడ్డం పెంచేశాడు. అంతకుమునుపు మల్లెపువ్వుల్లాంటి దుస్తుల్లో ఉండేవాడు బట్టల స్పృహపోయినట్లుంది. భుజం కింద చిరిగిన చొక్కా వేసుకుని ఉన్నాడు.

"రావోయ్ శర్మా! కమాన్ కూర్చో!" అంటూ లోపలికి ఆహ్వానించాడు మూర్తి." బొత్తిగా కనపడ్డంలేదు."

"ఊళ్లో లేను అంతా బాగున్నారా?"

"ఏం బాగోలే! సీతా!శర్మ వచ్చాడు. కాఫీ! లోపలికి కేకవేశాడు.

"ఇప్పుడే తాగొచ్చాను." మొహమాటంగా అన్నాను. మా కబుర్లు రాజకీయాల మీదకి ఎలెక్షన్ల మీదకు వెళ్లాయి.

"అన్నయ్యగారూ కాఫీ!" సీత కప్పులందించింది నవ్వుతూ.

"ఎందుకమ్మా శ్రమ! ఏంటి మన మూర్తి గడ్డం కూడా గీయలేదు పొదుపు ఉద్యమమా?"

"కాదన్నయ్యగారూ! మీరన్నా చెప్పండి. ప్రమోషన్ వదులుకున్నందుకు బాధపడ్తున్నారు. పోయిఉంటే బాగుండేది. నా మాటవిని చెడిపోయాను అంటున్నారు." సీత కళ్లల్లో కనిపించీ కనిపించనట్లు నీటపొర.

"ఒకసారి డెసిషన్ తీసుకున్న తర్వాత విచారించడం విజ్ఞుల లక్షణం కాదు. అందుకని బాధపడి భార్యా బిడ్డల్ని బాధ పెట్టమాకు" క్లాసు తీసుకున్నాను.

కాసేపటికి మూర్తి తేరుకున్నాడు.

"శర్మా! నాకన్నీ తెలుసురా. కాని కాని ఎవరన్నా రావును పొగిడితే... నా అసమర్థతకు అద్దం పడితే బాధవేస్తుంది. నా పిల్లల చదువుకోసం నా భార్య సుఖంకోసం ప్రమోషన్ త్యాగం చేశాను. కానీ ఆ గుర్తింపు వీళ్లకు లేదురా అది నాబాధ" ఈ సారి మూర్తి కళ్లల్లో నీళ్ల పొర చూశాను.

"ఎవరో మన్ని గుర్తించాలని చేసే త్యాగం త్యాగం కాదురా, అయినా అవన్నీ మర్చిపో" అని చెప్పి వచ్చేశాను.

చీకట్లో నడుస్తున్నాను. వీధి దీపాలు మసగ్గా వెలుగుతున్నాయి. 'శర్మా'! అని పిల్చినట్లు

అనిపిస్తే వెనక్కి తిరిగి చూశాను.

ఓ సన్నటి ఆకారం నావైపు కదిలి వస్తున్నది. ముందు పోల్చుకోలేకపోయాను. రావును గుర్తుపట్టాను.

"ఏం షికార్లు తిరుగుతున్నావా ఈ రాత్రప్పుడు?" అడిగాను.

"ఛీ! షికార్లా! నా బొందా! ఇప్పుడే బస్సు దిగి వస్తున్నాను. మళ్లీ రేపు ఉదయం ఎనిమిదికల్లా బస్టాండుకు పోవాలి!" బాధగా చెప్పాడు రావు.

నడుస్తూ ఉంటే ఓ లైటు కాంతి అతని మొహం మీద పడింది. రావు బాగా దూసుకుపోయాడు. గుర్తుపట్టడం కష్టం!

"ఏంరా! ఇలా అయిపోయావు? తిండి తింటం లేదా?

"హహ! తిండ" నవ్వాడు రావు తింటున్నాను ఎటొచ్చీ అదేవంట బట్టడం లేదు."

ఏం? ఇంటినుండి క్యారియర్ తీసుకుపోవడం లేదా?"

"అబ్బా! అంత పొద్దునే వండి పెట్టాలంటే ఊర్మిళకు కష్టమేరా! అప్పటికి నిద్ర కళ్లతో లేచినాకు కావలసినవన్నీ సమకూరుస్తుంది. కొన్నాళ్లు వంట కూడా చేసి పెట్టింది కాని చప్పగా చల్లారిపోయి నేనే తినలేకపోయేవాణ్ని అందుకే ఉన్న ఓ చిన్నహోటల్లో నాలుగు మెతుకులు గతుకుతున్నాను" చెప్పాడు రావు.

అప్పుడు చూశాను అతని చేతిలోని లగేజి వంక, ఓ వైరు బుట్టలో నీళ్లు తీసుకుపోయే ప్లాస్కు, పుస్తకాలు తదితరం ఉన్నాయి.

"రోజూ ఇలా వచ్చిపోయేకంటే అక్కడే ఓ వారం ఉండొచ్చుగా! ఉచితంగా ఓ సలహా పారేశాను.

"నేను ఒక్కరోజు లేకపోతే ఇల్లు గడవదు అని నీకు తెలీదా? ఇప్పటికే మా ఆవిడ పిల్లల్ని స్కూళ్లల్లో దింపి ఇంటికితీసుకొచ్చి నానా అవస్థపడుతున్నది. ఇక్కడ ఉండలేం, అక్కడికి ఫ్యామిలీ షిఫ్టు చేయలేం. సుఖంగా ఉన్న ప్రాణాన్ని కష్టాల్లో పడేసుకున్నాను." విచారిస్తూ వెళ్లిపోయాడు. కాలచక్రం పరిభ్రమిస్తూనే ఉంది.

ఒకరోజు మూర్తి మా ఇంటికి వచ్చాడు. అతను తేరుకున్నాడు. ఇప్పుడు నీటుగా కనిపిస్తున్నాడు.

"శర్మా! డ్రస్ చేసుకో రావును చూసొద్దాం". "ఏమైంది రావుకు?"

"తెలీదు. హాస్పిటల్లో జాయినై పదిరోజులైందిగా"

"ఆ! ఏం జబ్బు?" ఆశ్చర్యంగా బాధగా అడిగాను.

"ఓ! చాలా వచ్చాయి. అన్నీ కాంప్లికేషన్లే! ఒకటి క్యూర్ చేస్తే ఇంకోటి వస్తుంది. రాత్రి సీరియస్ అయింది. ఆఫీసులో చెప్పుకున్నారు. పోదాం పద!" మూర్తి చెప్పాడు ఆందోళనగా.నా మెదడు మొద్దుబారిపోయింది. రావును ఐరన్ మ్యాన్ అంటూ ఉండేవాళ్లం. మా సర్కిల్లో అతనే మాంఛి ఆరోగ్యవంతుడు. తుమ్మి, దగ్గి ఎరుగడు. వర్షంలో తడిసేవాడు. వడగాలిలో తిరిగేవాడు. రాత్రుళ్లు బాగా పొద్దుపోయేవరకు మేల్కొంటూ ఉండేవాడు.

దార్లో చెప్పడం మొదలెట్టాడు రావు గురించి మూర్తి. "అసలు రావు చేసిన మొదటి తప్పు ప్రమోషన్ యాక్సెప్ట్ చేయడం పోనీ చేరితే చేరాడు. రోజూ ఆ ఊరి నుంచి ఈ వూరికి ఈ ఊరినుంచి ఆ ఊరికి తిరగడం అతను చేసిన రెండో తప్పు. అక్కడే ఇల్లు తీసుకుని ఫ్యామిలీని షిఫ్టుచేసి ఉండాల్సింది. అలాకానప్పుడు పదిహేను రోజులకొకసారి వచ్చి పోవాల్సింది. పోనీ తిరిగితే తిరిగాడు ఇంటినుంచి తిండి తీసుకుపోతే సరిపోయేది.

రెండొందలు పెరిగిందని పోతే పైన వెయ్యి అదనంగా ఖర్చు పెట్టాల్సి వస్తుంది నెలకి.”

“అది సరే, అసలు ఏం జబ్బు ఎలా వచ్చింది.”

“రెండు మూడు నెలలు బాగానే ఉన్నాడు. తరువాతే ఈ అలసటను అతను శరీరం తట్టుకోలేకపోయింది. వాతావరణం మార్పు భోజనం మార్పు శ్రమ అన్నీ కలిసి అతనిలోని రోగనిరోధక శక్తిని విధ్వంసం చేశాయి. అతనికిప్పుడు బిపి వచ్చింది. డయాబిటీస్ ఉంది. ఆస్తమా వచ్చింది. కాళ్లవాపు, స్కిన్ డిసీజ్” మూర్తి చెబుతున్నాడు కాని నాకే వినపడ్డం లేదు.

“ఏనుగులాంటి మనిషి పీనుగయ్యాడు.” నిట్టూర్చాను.

హాస్పిటల్లో స్పెషల్ వార్డులో మంచానికి అతుక్కుపోయిన రావును చూసేసరికి నా కళ్లల్లో నీళ్లు తిరిగాయి. నన్ను చూడగానే సావిత్రికి దుఃఖం పొంగి పొర్లింది.

“ఇప్పుడెలా ఉంది?” అడిగాను.

“రాత్రి బాగా గాబరా పెట్టేశారు. సమయానికి దేవుళ్లలాగా డాక్టర్లు వచ్చి బతికించారు” సావిత్రి పూడుకుపోయిన గొంతుతో చెప్పింది.

“సారీ! టైమింగ్స్ కుదరక ఈ మధ్య మీ ఇంటికి రాలేకపోయాను. ఊర్నుండి వచ్చేసరికి లేటవుతుంటుంది కాబట్టి తనూ నన్ను కలవలేదు. కాని ఆర్నెల్ల తర్వాత ఇంత భయంకరంగా కల్సుకుంటామని అనుకోలేదు కల్లోకూడా! ” సంజాయిషిగా చెప్పాను సావిత్రికి.

రావు కళ్లు విప్పి చూస్తున్నాడు. కొంచెం శక్తి పుంజుకుని పైకి లేవడానికి ప్రయత్నించాడు. సావిత్రి అతన్ని వారించి తలగడ సరిచేసి కొంచెం ఎత్తుగా లేపి కూర్చోబెట్టింది.

“రావు! నీ ఇన్ఫ్లూయన్స్ ఉపయోగించి ట్రాన్స్ఫర్ చేయించుకుని కర్నూలుకు వచ్చేయ్. అన్ని రోగాలూ పోతాయి” చెప్పాను.

‘‘ఆ! ప్రయత్నించి ప్రయత్నించి విసిగెత్తిపోయింది. నాకు మూర్తిని చూస్తూఉంటేజెలసీగాఉంది.

“రావు! మనసు పాడుచేసుకోమాకు. రెస్టు కావాలి”. మూర్తి అన్నాడు అతన్ని వారిస్తూ.

“శర్మా! ఈ కొద్దిపాటి కాలంలోనే కనుక్కున్న జీవిత సత్యం ఒకటి ఉంది. మనిషికి ఎన్ని ఉన్నా తృప్తి ఉండాలి. కంటెంట్మెంట్! అది లేనప్పుడు అన్నీ ఉన్నాలేనట్లే. అది ఆ తృప్తి ఉంటే ఏవీ లేకపోయినా అన్నీ ఉన్నట్లే!” బాగా ఆయాసపడ్డాడు. మాటలు రాక దిండుకు జారగిలపడ్డాడు.

అవును, మూర్తి ఉన్నదాంతో తృప్తి పడి సుఖంగా బతికేస్తున్నాడు. అసంతృప్తితో పదవుల వెంట పరిగెత్తి రావు ఒళ్లు ఇల్లు గుల్లచేసుకున్నాడు. కష్టాన్ని, సుఖాన్ని వేరు చేసేది తృప్తి! రావు కొన్నాళ్లకి వెనక్కి రాగలడేమో కాని పోయిన అతని ఆరోగ్యం తిరిగి వస్తుందా ఆలోచిస్తుంటే బాధ కల్గింది.

“రావు! స్వానుభవంతోకానితత్వంబోధపడదు. ఇప్పటికైనా తృప్తిగా బతుకు” ఓదార్పుగాఅన్నాను.

(ఆదివారం ఉదయం జులై 12/1992)

